ప్రజాశక్తి
మంగళవారం 4 ఏప్రిల్ 2023
5
శ్రీకాకుళం



ఆర్‌టిసిలో త్వరలో హెవీ డ్రైవింగ్‌కు శిక్షణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం


ఆర్‌టిసిలో ఈనెల రెండో వారంలో 12వ బ్యాచ్‌కు హెవీ డ్రైవింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 11 బ్యాచ్‌లకు విజయవంతంగా శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. ఆర్‌టిసిలో శిక్షణ పొందిన వారికి రాబోయే రోజుల్లో ఆర్‌టిసితో పాటు ఇతర ప్రభుత్వ శాఖల్లో మంచి అవకాశాలు ఉంటాయని తెలిపారు. హెవీ లైసెన్స్ వచ్చిన 18 నెలల తర్వాత ఆ రోజు పరిస్థితిని బట్టి ఆర్‌టిసిలో అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు 9963091999, 7382921920 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ధర్మాన గైర్హాజరు

- సిఎంతో సమావేశానికి రెవెన్యూ మంత్రి డుమ్మా
- హాట్ టాపిక్‌గా మారిన గైర్హాజరు అంశం
- తెర పైకి రకరకాల ప్రచారాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లిలో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశానికి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు గైర్హాజరయ్యారు. కీలకమైన సమావేశానికి ధర్మాన హాజరు కాకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రకరకాల ప్రచారాలు ఊపందుకుంటున్నాయి. అటు సొంత పార్టీ కేడర్‌తో పాటు టిడిపి నాయకుల మధ్య కూడా ఇదే హాట్ టాపిక్‌గా మారింది. మరోవైపు మంత్రి ధర్మాన ప్రసాదరావు కూడా గుంభనంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటివరకు దీనిపై నోరు మెదపలేదు. తాడేపల్లిలోనే మంగళవారం పార్టీ రీజనల్ కోఆర్డినేటర్స్ సమావేశం నిర్వహించనున్నట్లు అధిష్టానం ప్రకటించింది. ఈ సమావేశానికి హాజరవుతారా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.



శ్రీకాకుళం నగరం, రూరల్ మండలాల్లో ఆసరా కార్యక్రమాలు ఉన్నందున సమావేశానికి ధర్మాన వెళ్లలేకపోయారని ఆయన ముఖ్య అనుచరులు చెప్తున్నారు. సిఎంతో ఈనెల మూడో తేదీన సమావేశం ఉందని అధిష్టానం ఇచ్చిన సమాచారంతో ఆ రోజు షెడ్యూల్ ఖాళీ ఉంచాలని ఆయన వ్యక్తిగత కార్యదర్శికి చెప్పినట్లు తెలిసింది. అంతలోనే మూడో తేదీన తీరిక లేని కార్యక్రమాలు పెట్టడంతో సొంత కేడర్‌కు సైతం ఆంతర్యం అర్థం కావడం లేదు. సిఎం నుంచి పర్మిషన్ తీసుకున్నట్లు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. అనారోగ్యం, బలమైన కారణాలుంటే తప్ప సమావేశానికి మినహాయింపునివ్వరు. కేవలం ఆసరా కార్యక్రమం కోసమే సిఎం అనుమతిచ్చేశారా అన్న చర్చ సాగుతోంది. ఆసరా కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు ఆ కార్యక్రమాల్లో తీరిక లేకున్నా అంతా హాజరయ్యారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు గైర్హాజరుపై రకరకాల ప్రచారాలు తెర పైకి వచ్చాయి. గత నెలలో మంత్రులతో సిఎం జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశం తర్వాత ధర్మానను స్పీకర్‌గా చేయాలని సూచించారని, దీంతో ఆయన పెద్ద ఆసక్తి చూపలేదనే చర్చ సాగుతోంది. అలకబూని సమావేశానికి డుమ్మా కొట్టారని అనుకుంటున్నారు. సమావేశం అజెండా, స్క్రిప్టును ముందే తెలుసుకున్నారని, సమావేశంలో ప్రాధాన్య అంశాలేమీ లేదని తెలుసుకున్న తర్వాతే ఆయన గైర్హాజరు కావాలని నిర్ణయించుకున్నట్లు పార్టీలో చర్చ నడుస్తోంది. పార్టీలో సీనియర్లుగా గడప గడపకు మన ప్రభుత్వం సమీక్షలో ముఖ్యమంత్రితో నలుగురి మధ్య చీవాట్లు తినడాన్ని అవమానంగా భావించడం వల్లే ఈసారి సమావేశానికి దూరంగా ఉన్నారని పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు ఉంటాయంటున్న వార్తల నేపథ్యంలో అందుకు సంబంధించిన ప్రకటన వచ్చిన తర్వాతే ఇందులో ఎంతవరకు వాస్తవముందో తెలియనుంది.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

- హాజరు కావాల్సిన విద్యార్థులు 29,006
- పరీక్ష రాసిన వారు :28,859
- 99.49 శాతం హాజరు
- ప్రారంభమైన ఓపెన్ స్కూల్ పరీక్షలు
- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి / యంత్రాంగం

జిల్లావ్యాప్తంగా సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తొలిరోజు ఎక్కడా ఎటువంటి ఘటనలు నమోదు చేసుకోలేదని అధికారులు వెల్లడించారు. ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, పరీక్షల జిల్లా పరిశీలకులు, జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు చర్యలను ఎస్‌పి జి.ఆర్ రాధిక స్వయంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

జిల్లావ్యాప్తంగా 149 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 29,006 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 28,859 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 99.49 శాతం హాజరు నమోదైంది. పరీక్షకు 147 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఓపెన్ స్కూళ్ల విద్యార్థులకూ బుధవారం నుంచే పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఓపెన్ స్కూల్‌కు సంబంధించి ఎస్‌ఎస్‌సి పరీక్షలకు 894 మంది దరఖాస్తు చేసుకోగా 780 మంది (87.25 శాతం) హాజరయ్యారు. 114 మంది విద్యార్థులు పరీక్షలకు రాలేదు. అదేవిధంగా ఇంటర్మీడియట్ పరీక్షలు 1500 మంది రాయాల్సి ఉండగా 1378 మంది (91.87 శాతం) రాశారు. 121 మంది హాజరు కాలేదు.



శ్రీకాకుళం గవర్నమెంట్ హైస్కూల్ వద్ద బారులు తీరిన విద్యార్థులు



శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షల తీరును పరిశీలిస్తున్న కలెక్టర్

పరీక్షలకు హాజరవుతున్న వారికి ఉచితంగా ఆర్‌టిసి ప్రయాణం అమలు చేసినా చాలనన్ని బస్సులు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఆటోల్లోనే ప్రయాణించారు. సాధారణ రూట్లలో తప్ప ప్రత్యేకించి బస్సులు లేకపోవడంతో విద్యార్థులు ఆటోలు, మ్యాక్సీ క్యాబ్‌లు, ఇతర ప్రయివేటు వాహనాలను ఆశ్రయించారు. పొందూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల కేంద్రాన్ని ఎపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ గొండు సీతారాం తనిఖీ చేశారు. ఏ ఒక్క తరగతి గదిలో ఫ్యాన్లు లేవని, పూర్తిగా తాగునీటి సదుపాయం లేదని, ప్రాథమిక వైద్య చికిత్సకు అవసరమయ్యే కనీస మందులు లేకపోవడంపై ఎంఇఒ పైడి రామరాజుపై అసహనం వ్యక్తం చేశారు. డిఇఒ గార పగడాలమ్మతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. తక్షణమే అన్ని తరగతి గదుల్లో ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఇచ్ఛాపురంలో పరీక్షా కేంద్రం వద్ద గేటు ముందు విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించడంతో ట్రాఫిక్‌కు కొంత అంతరాయం కలిగింది.

పరీక్షా కేంద్రాలు పరిశీలన

పదో తరగతి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించేందుకు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రాన్ని సందర్శించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లకు పలు సూచనలు చేశారు. పదో తరగతి పరీక్షల పరిశీలకులు బి.విజయభాస్కర్ గార మండలంలోని గార, అంపోలు, శ్రీకూర్మం, కళింగపట్నంలోని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ పలు కేంద్రాలను సందర్శించారు. రణస్థలం మండలం రణస్థలం, జెఆర్‌పురం, ఎచ్చెర్ల ఉన్నత పాఠశాలలు, రణస్థలం మోడల్ స్కూల్ కేంద్రాలను పరిశీలించారు. తరగతి గదుల్లో ఏర్పాట్లు, తాగునీరు, వైద్య సేవలను పరిశీలించారు.

శ్రీకాకుళం నగరంలోని ఇలిసిపురం ఆర్‌సిఎం లయోలా, హడ్కో కాలనీలోని మున్సిపల్ హైస్కూల్ పరీక్షా కేంద్రాలను ఎస్‌పి జి.ఆర్ రాధిక పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. వేసవి దృష్ట్యా విద్యార్థులకు తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయాలని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించొద్దని సూచించారు. ప్రశ్నాపత్రాల భద్రత, పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు సజావుగా జరిగేలా పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

నీటి ఎద్దడి నివారణపై దృష్టి

- పూర్తిస్థాయిలో జగనన్న స్వచ్ఛ సంకల్పం అమలు
- 'ఉపాధి'లో రోజు కూలి పెరగాలి
- సకాలంలో ఇళ్ల నిర్మాణాలు
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో తాగునీటి ఎద్దడి పరిస్థితి రాకూడదని, అందుకనుగుణంగా గ్రామస్థాయి పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. పలు అభివృద్ధి పనులపై జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి అధికారులతో కలెక్టరేట్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 650 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మించినా, 73 కేంద్రాల్లో వర్మీకంపోస్టు తయారు కావడం లేదన్నారు. తక్షణమే వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. చెత్త పన్ను వసూలు సగటున 60 శాతం కావాల్సి ఉండగా, కొన్ని మండలాల్లో 40 నుండి 50 శాతంగా ఉందన్నారు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టిసారించాలని సూచించారు. రానున్న రెండు మాసాల్లో వడగాలులు తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ శాఖలు విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గతంలో మాదిరిగానే చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పాఠశాల, గ్రామ ఆరోగ్య కేంద్రంలో ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు.

ఉపాధి హామీ అమల్లో గతేడాది రాష్ట్రస్థాయిలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందని, ఈ ఏడాదీ ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో రోజుకు సరాసరిన 1.50 లక్షల మందికి ఉపాధి కల్పిస్తుండగా, వాటిని మరింత పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. దినసరి కూలి రూ.189గా ఉంటోందని... గరిష్ట కూలి అందేలా ఎపిఒలు, ఎంపిడిఒలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో 242 ప్రాధాన్యత భవనాలు తుదిదశకు చేరాయని, వాటిని ముందుగా పూర్తి చేయాలన్నారు. ఈనెల 15వ తేదీ నాటికి 26,731 గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించిందని, ఇప్పటివరకు 24,450 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రీ సర్వేలో సర్వే పూర్తి చేయడమే కాకుండా సదరు యజమానికి భూహక్కు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన తర్వాతనే రీ సర్వే ప్రక్రియ పూర్తయినట్లని స్పష్టం చేశారు. జిల్లాలో ఇంకా 1.70 లక్షల స్టోన్స్ ప్లాంటేషన్ చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం అందుబాటులోనున్న రోవర్స్‌లను ఆయా మండలాలకు కేటాయించినట్లు తెలిపారు. మొదటి విడత రీ సర్వే పూర్తయిన 350 గ్రామాల్లోని భూహక్కు- భూరక్ష పత్రాల్లోని లోటుపాట్లను సవరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, గృహనిర్మాణశాఖ, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు ఎన్.గణపతిరావు, విద్యాసాగర్, జి.వి చిట్టిరాజు, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ టి.ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

గిరిజనులకు పట్టాలు ఇవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండలంలోని పెద్దమడి, నందవకొత్తూరులో తరతరాలుగా గిరిజనులు సాగు చేస్తున్న భూములకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్ డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది తప్పుడు పత్రాలు సృష్టించి గిరిజన భూములను దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు.



ధర్నా చేస్తున్న నాయకులు, గిరిజనులు

గిరిజనుల భూములను గిరిజనేతరులు ఆక్రమించుకుంటున్నారని, వాటికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని గిరిజనుల సాగులో ఉన్న భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలన్నారు. తప్పుడు పత్రాలను సృష్టించిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన భూ పోరాటానికి మద్దతుగా ఈనెలలో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. అనంతరం తహశీల్దార్ పి.సరోజకు వినతిపత్రం అందించారు. ధర్నాలో గిరిజన సంఘం నాయకులు బాలరాజు, జె.రామకృష్ణ, పి.కృష్ణవేణి, విమల కుమారి, సూరమ్మ, గౌరమ్మ, రోహిణి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎపిపిఎస్‌సి గ్రేడ్-4 పరీక్ష

జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి

ప్రజాశక్తి - శ్రీకాకుళం



ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ (గ్రేడ్-4) తుది పరీక్షను ఈనెల 4వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి తెలిపారు. కలెక్టరేట్‌లోని ఆమె ఛాంబరులో సంబంధిత అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 4వ తేదీన ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర కళాశాలలో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ (గ్రేడ్-4) తుది పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే ఈ పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందే చేరుకోవాలని, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, కాలిక్యులేటర్లు, మొబైల్ ఫోన్లు అనుమతించబోమని స్పష్టం చేశారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్‌టిసి బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పోలీసు శాఖ గట్టి బందో బస్తును ఏర్పాటు చేయాలన్నారు. లైజనింగ్ కోసం ఎచ్చెర్ల తహశీల్దార్‌ను నియమించినట్లు తెలిపారు. ఎటువంటి సమస్యలు తలెత్తినా లైజనింగ్ అధికారులను సంప్రదించవచ్చని చెప్పారు. సమావేశంలో డిఎస్‌పి ఎం.మహేంద్ర, ఎపిపిఎస్‌సి సెక్షన్ ఆఫీసర్ కె.భాస్కరరావు, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పి.పద్మప్రియ, విద్యుత్, ఆర్‌టిసి, వైద్యారోగ్య, కళాశాలకు చెందిన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పోర్టు రోడ్డుకు భూములు ఇచ్చేది లేదు

టెక్కలి: వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న భూములను భావనపాడు పోర్టు రోడ్డు కోసం ఇచ్చేది లేదని రైతులు స్పష్టం చేశారు. పోర్టు రోడ్డు కోసం తమ భూములను లాక్కోవద్దని మండలంలోని మోదుగువలస, అయోధ్యాపురం, బన్నువాడ, టెక్కలి, పిఠాపురం, నంబాళ్లపేట, తలగాం, వేములవాడ, విశ్వనాథపురం తదితర గ్రామాల రైతులు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. మదనగోపాలసాగరం, దాలిచెరువు ఆయుకట్టు కింద వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నామని, అటువంటి భూములను తీసుకుంటే తామెలా బతకాలని ప్రశ్నించారు. సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి రైతుల ఆందోళన వద్దకు వచ్చారు. అభివృద్ధి దృష్ట్యా భూములను సేకరిస్తున్నామని, రైతులు సహకరించాలని కోరారు. భూములు కోల్పోయిన వారికి పరిహారంతో పాటు ఉపాధి, ఉద్యోగాలు కల్పిస్తామని హామీనిచ్చినా రైతులు అంగీకరించలేదు. అవేవీ తమకు వద్దని, మా భూములు తీసుకోకుండా ఉంటే చాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.షణ్ముఖరావు, రైతులు నంబాళ్ల రామకృష్ణ, ధర్మారావు, కూర్మారావు, రాంబాబు, బుడుమూరు చంద్రశేఖర్, ఎం.గణపతి, పి.రాము తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న రైతులు

చలో ఢిల్లీకి పయనం

శ్రీకాకుళంఅర్బన్: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక, రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక హక్కుల కోసం ఈనెల ఐదో తేదీన చేపడుతున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి జిల్లా నుంచి కార్మిక, రైతు, ప్రజాసంఘాల నాయకులు సోమవారం బయలుదేరి వెళ్లారు. విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ కె.నాగమణి నాయకులకు పూలమాలలు వేసి వీడ్కోలు పలికారు. పోరాటాలతోనే హక్కులు సాధ్యమని, ఐక్య పోరాటాలతో కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ కె.నాగమణి, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ అన్నారు.



చలో ఢిల్లీకి బయలుదేరి వెళ్తున్న ప్రజాసంఘాల నాయకులు

మంత్రిపై కేసు నమోదు చేయాలి



మాట్లాడుతున్న కూన రవికుమార్

ప్రజాశక్తి - పలాస

టిడిపి పలాస మండల అధ్యక్షులు కుత్తుం లక్ష్మణ్‌పై జరిగిన హత్యాయత్నంలో పాత్రదారులతో పాటు, సూత్రదారులైన మంత్రి అప్పలరాజుపై తక్షణమే ఎస్‌పి జిఆర్.రాధిక కేసు నమోదు చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాబాయిని చంపి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హత్యా రాజకీయాలను చూసి ప్రశాంతంగా ఉన్న జిల్లాలో ఎటువంటి రాజకీయ అనుభవం లేని మంత్రి అప్పలరాజు సూత్రదారుడుగా ఉంటూ హత్యా రాజకీయాలను ప్రోత్సహించడం సరికాదని అన్నారు. కాశీబుగ్గ డిఎస్‌పి శివరామిరెడ్డి తన తీరును మార్చుకోవాలని, పేరులో రెడ్డి ఉన్నంత మాత్రాన టిడిపి పార్టీకి రెడ్డివి కాదని, రానున్న రోజుల్లో చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు.

'నర్తు'పై నాన్‌బెయిల్‌బుల్ కేసు నమోదు చేయాలి: శిరీష

లక్ష్మణ్‌పై హత్యాయత్నానికి ప్రయత్నించిన వైసిపి నాయకులు నర్తు ప్రేమ్‌కుమార్‌పై నాన్‌బెయిల్‌బుల్ కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని, లేకుంటే టిడిపి నేతలపై దాడి చేసిన వారిపై ప్రతి దాడికి దిగుతామని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల భూ కబ్జాలపై స్పందన నిర్వహించిన మంత్రి అప్పలరాజు 'నా వెనుక ఉన్న నలుగురు అక్రమాలకు పాల్పడితే నేను కూడా తప్పు చేసినట్లేన'ని, విలేకరుల ముందు ఒప్పుకున్న విషయాన్ని గుర్తు చేశారు. మంత్రిని అనుసరిస్తున్న అల్లు వెంకటరమణ, మొదలవలస మన్మథ, హనుమంతు రామ్మోహనదొర, చింతాడ గణపతిలు భూ దందాలు చేయడం, కబ్జాలు చేయడంలో సిద్ధహస్తులని అన్నారు. అక్రమాలపై ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం సరికాదని, పోలీసులు వ్యవస్థ తీరును మార్చుకోవాలని అన్నారు. కెటి రోడ్డు విస్తీరణ పనులు చేయలేని మంత్రి ఆఫ్‌షోర్ పనులు పూర్తి చేస్తామని పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. దాడి ఘటనలో నిందితులపై పోలీసులు ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. సమావేశంలో టిడిపి నాయకులు వజ్జ బాబూరావు, విఠల్, లొడగల కామేష్‌యాదవ్, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు పాల్గొన్నారు.

పరామర్శించిన అచ్చెన్న

ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టిడిపి మండల అధ్యక్షులు లక్ష్మణ్‌ను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం పరామర్శించారు. దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తొలుత లక్ష్మణ్‌ను కూన రవికుమార్ పరామర్శించారు. ఆయన వెంట గౌతు శిరీషా, వజ్జ బాబూరావు, విఠల్, లొడగల కామేష్, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజులు ఉన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

ఆశలన్నీ మీ పైనే...

- ప్రభుత్వానికి అండగా నిలవాలి
- లేదంటే కూర్చొన్న కొమ్మను నరుక్కున్నట్టే
- 'ఆసరా' సభలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశలన్నీ మహిళలపైనే పెట్టుకున్నారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. అధికారం ఇచ్చే అవకాశం మహిళల చేతుల్లోనే ఉందన్నారు. మండలంలోని రాగోలు, నగరంలోని పిఎస్‌ఎన్ఎం స్కూల్ ఆవరణలో ఆసరా లబ్ధిదారులతో సోమవారం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని, అందులో భాగంగా మూడు విడతల్లో మహిళలకు అసరా పథకం ద్వారా సాయం అందించినట్లు తెలిపారు. చంద్రబాబు ఇచ్చిన మాటను ఏనాడూ నిలబెట్టుకున్న దాఖలాలు లేవన్నారు. అందువల్ల మహిళలు ఎవరూ చంద్రబాబుకు ఓటు వేయరని చెప్పారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ఇంటిని నడిపే ఇల్లాలికి పురుషులతో సమానంగా గౌరవం దక్కిందన్నారు. ఇల్లాలికి ఆర్థిక ఆసరా దక్కే విధంగా పథకాలు అమలు చేస్తున్నామన్నారు. అందువల్ల మీరంతా జగన్‌కు ఓటు వేస్తారా, చంద్రబాబుకు వేస్తారో తేల్చుకోవాలన్నారు. పనిచేసే ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. మళ్లీ వైసిపి అధికారంలోకొస్తేనే ఇప్పుడు అందుతున్న పథకాలన్నీ అందుతాయన్నారు. లేదంటే కూర్చొన్న కొమ్మను నరుక్కున్నట్టేనని వ్యాఖ్యానించారు.


కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, ఎంపిపి అంబటి నిర్మల, జెడ్‌పిటిసి రుప్ప దివ్య, కార్పొరేషన్ల చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, ఎఎంసి చైర్మన్ మూకళ్ల తాతబాబు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్లు ఎం.వి పద్మావతి, పైడిశెట్టి జయంతి, మాజీ జెడ్‌పిటిసి చిట్టి జనార్ధనరావు, రాగోలు సర్పంచ్ గేదెల చెంగలరావు, వైసిపి నాయకులు బొడ్డేపల్లి పద్మజ, గొండు కృష్ణమూర్తి, చల్లా రవికుమార్, చిట్టి రవి, యజ్జల గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'వాత్సల్య'పై విస్తృత ప్రచారం

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

ప్రజాశక్తి - పొందూరు

అభాగ్య పిల్లలను ఆదుకోవడానికి వాత్సల్య పేరిట నూతనంగా ప్రవేశపెట్టిన పిల్లల సంక్షేమ పథకంపై జిల్లాలో విస్తృత ప్రచారం చేయాల్సిన బాధ్యత అంగన్వాడీల కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారులపై ఉందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా పొందూరు మార్కెట్ యార్డు సమావేశ మందిరంలో సిడిపిఒ డి.పాపినాయుడు ఆధ్వర్యాన అంగన్వాడీ సిబ్బంది, అధికారులతో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు కోల్పోయిన బాలలకు ఆర్థికంగా అండగా నిలవాలనే సంకల్పంతో మిషన్ వాత్సల్య పేరిట నూతన పథకాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు, విడాకులు పొందిన తల్లిదండ్రులు, ప్రాణాంతక వ్యాధులతో ఉన్న తల్లిదండ్రులు, పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయిన పిల్లలకు నెలకు రూ.నాలుగు వేలు అందిస్తుందన్నారు. అభాగ్యులైన పిల్లలందరినీ పథకంలో చేర్పించి వారి జీవితాలకు భద్రతను అందించాలని సూచించారు. జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ యు.శ్రీలక్ష్మి, సిడిపిఒ డి.పాపినాయుడు మాట్లాడుతూ ఈ పథకంలో చేరాలనుకునే పిల్లల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.96 వేలకు మించరాదని స్పష్టం చేశారు. ఈ పథకం అందుకునే బాలలు ఏదైనా వసతిగృహాలు, బాల సదనాల్లో చేరితే ఈ ఆర్థిక సహాయం ఆగిపోతుందని తెలిపారు. సమావేశంలో సిడబ్ల్యుసి సభ్యుడు ఎం.గన్నెప్పడు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కొండలరావు, సిఆర్‌పిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ పి.శేఖర్, కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వాసుదేవకుమార్, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గొండు సీతారాం



ట్రోఫీని అందజేస్తున్న ఎస్‌పి రాధిక

క్రీడల్లో రాణిస్తే భవిష్యత్

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి- మెళియాపుట్టి

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని ఎస్‌పి జి.ఆర్.రాధిక అన్నారు. మండలంలో పెద్దమడి రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో మూడు రోజులుగా పోలీసుల ఫ్రెండ్లీ క్రికెట్, వాలీబాల్, కబడ్డీ టోర్నమెంట్లను నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో 14 జట్లు పాల్గొన్నాయి. సోమవారం ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌లో పాతపట్నం ఆదివాసీ జట్టు, లోకల్ బాయ్స్ జట్టు తలబడ్డాయి. ఈ మ్యాచ్‌లో పాతపట్నం ఆదివాసీ జట్టు విజయం సాధించింది. అలాగే వాలీబాల్ టోర్నమెంట్‌లో ప్రథమ విజేతగా పాతపట్నం బాయ్స్ జట్టు విజయం సాధించగా, ద్వితీయ స్థానంలో పాతపట్నం తేజ్ హెడ్ జట్టు నిలిచింది. అలాగే కబడ్డీ బాలికలో రన్నర్‌గా రంజిత్ జట్టు గెలుపొందింది. అనంతరం విజేతలకు ట్రోఫీ, బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఫ్రెండ్లీ పోలీస్ ద్వారా ఈ టోర్నమెంట్‌ను నిర్వహించామని అన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి సహకరించాలన్నారు. బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి విఠలేశ్వరరావు, కాశీబుగ్గ డిఎస్‌పి శివరామిరెడ్డి, పాతపట్నం సిఐ వినోద్‌బాబు, కొత్తూరు సిఐ వేణుగోపాలరావు, ఎస్‌బిసి సిఐ శ్రీనివాసరావు, మెళియాపుట్టి, పాతపట్నం, కొత్తూరు ఎస్‌ఐలు రాజేష్, కామేశ్వరరావు, గోవిందరావు, ఎఎస్‌ఐలు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

కార్మికులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

రావివలస మెట్‌కోర్ ఎల్లాయిస్ లిమిటెడ్‌లోని 150 మంది కార్మికులకు ఫిబ్రవరి నుండి జీతాలు, 2022 ఆగస్టు బకాయిలు చెల్లించాలని మెట్‌కోర్ ఎల్లాయిస్ లిమిటెడ్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు ఎన్.షణ్ముఖరావు ఆధ్వర్యాన సోమవారం టెక్కలి లేబర్ అసిస్టెంట్ కమిషనర్ జి.ఎల్లాజిరావుకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గత నెల సబ్ కలెక్టర్ సమక్షంలో కార్మికశాఖ కార్యాలయంలో యాజమాన్యానికి, లేబర్ కమిషనర్స్, కార్మికులు, రావివలస గ్రామ పెద్దలతో నిర్వహించిన సంయుక్త సమావేశం నిర్వహించారని అన్నారు. కనీస వేతనాలు చెల్లించాలని, బకాయిలు చెల్లించాలని, వారాంతపు సెలవులు, వైద్యం లేదని, కార్మిక హక్కులు అమలు చేయాలని సబ్ కలెక్టర్ దృష్టికి తెచ్చామన్నారు. ఆయన స్పందించి, సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారని, నేటికీ పరిష్కారం కాలేదన్నారు. స్పందించిన కార్మికశాఖ అధికారి యాజమాన్య ప్రతినిధికి ఫోన్ చేసి, కార్మికులకు జీతాలు, బకాయిలు చెల్లించాలని ఆదేశించారు. వినతిపత్రం అందజేసిన వారిలో కార్మికులు రాములు, మల్లేశు, సచిన్, తిరుపతి, అప్పన్న, నవీన్, విజయ, శ్రీను, శేషగిరి, సింహాచలం, కోటి, మన్మథ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' వినతులకు సత్వర పరిష్కారం

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ మేరకు వివిధ మండలాలకు చెందిన ఫిర్యాదుదారుల నుంచి జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరీ, ఉప కలెక్టర్ జయదేవి, కొవ్వాడ ఎస్‌డిసి మురళీకృష్ణతో కలిసి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పందనలో స్వీకరించే ప్రతి దరఖాస్తునూ 24 గంటల్లో పరిశీలించి పరిష్కరించడమా? తిరస్కరించడమా అనే అంశాలపై వివరణ ఇవ్వాలని అన్నారు. అక్రమణలకు పాల్పడిన వ్యక్తులకు పలాస తహశీల్దార్ అండగా నిలుస్తూ భూముల హక్కుదార్లకు అన్యాయం చేస్తున్నారని కంట్రగడకు చెందిన కె.మహాలక్ష్మి ఫిర్యాదు చేశారు. కంట్రగడ రెవెన్యూ గ్రామంలో సర్వే నంబరు 59/1లో 0.83 సెంట్లు భూమి ప్రభుత్వం సేకరించి ఇళ్ల పట్టాలు ఇచ్చారని, కానీ, అక్కడ కాదని చిన్న,



సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

సన్న కారు రైతులైన తనకు రెంటికోట రెవెన్యూ గ్రామంలో ఉన్న సాగు భూమిలో ఎటువంటి పరిహారం ఇవ్వకుండా, తన అనుమతి తీసుకోకుండా తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సృష్టించి ఇళ్లు నిర్మించేందుకు పూనుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాతికేళ్లుగా స్వాతంత్ర్య సమరయోధుల పింఛను తీసుకుంటున్నానని, వ్యక్తిగత డేటాలో ప్రభుత్వ ఉద్యోగిగా చూపిస్తూ పింఛను నిలుపుదల చేశారంటూ కోటబొమ్మాళి మండలానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు సంపూర్ణ మ్మ కలెక్టర్ వద్ద మొరపెట్టుకున్నారు. గార మండలం అంబళ్లవలసకు చెందిన కర్రి పవన్ కళ్యాణ్ పుట్టకతో చెవుడు, ఈ ఏడాది జనవరి నుంచి పింఛను నిలుపుదల చేశారని ఫిర్యాదు చేశారు. జిల్లా వ్యాప్తంగా వివిధ వ్యక్తిగత, సామాజిక అవసరాలు తీర్చాలని కోరుతూ 193 మంది నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ వెంకట్రామన్, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, డిఎంహెచ్‌ఒ బొడ్డేపల్లి మీనాక్షి, డిఎస్‌ఒ వెంకటరమణ, డిపిఒ రవికుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ట్రైనింగ్ మాన్యువల్ బుక్‌లెట్ ఆవిష్కరణ

ఆరోగ్యశ్రీ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సూచించారు. జిల్లాలోని ఆరోగ్య మిత్రలకు, సచివాలయం ఎఎన్‌ఎంలకు ఆరోగ్యశ్రీ పథకంపై అవగాహన కల్పించేందుకు ఆరోగ్యశ్రీ ట్రస్టు రూపొందించిన ట్రైనింగ్ మాన్యువల్ బుక్‌లెట్లను జెడ్‌పిలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ జిల్లాలో సచివాలయం ఎఎన్‌ఎంలకు, ఆరోగ్యమిత్రలకు ఈ బుక్‌లెట్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ బుక్‌లెట్లు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందిస్తున్న వైద్య సేవల వివరాలు సమగ్రంగా వివరించాలన్నారు. జెసి ఎం.నవీన్, డిఎంహెచ్‌ఒ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ ప్రకాశరావు, డిసిహెచ్ ఎస్.భాస్కరరావు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న అచ్చెన్నాయుడు, శిరీష

అచ్చెన్న, శిరీష పరామర్శ

ప్రజాశక్తి- పలాస

మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి దువ్వాడ శ్రీనివాసరావు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, గౌతు శిరీష, వజ్జ బాబురావు మృతుని కుటుంబసభ్యులు మాజీ ఎమ్మెల్యే దువ్వాడ నాగావళి, కృష్ణమూర్తి నాయుడును పరామర్శించారు. మృతికిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారితో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, బి.నాగరాజు, జోగ మల్లి, డొక్కరి శంకర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టెండర్లకు ఆహ్వానం

ప్రజాశక్తి- పలాస

పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు, విధులు నిర్వహిస్తున్న వైద్యులకు డైట్ సరఫరా చేసేందుకు రెండేళ్ల కాల పరిమితతో సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఆస్పత్రి సమన్వయ అధికారి భాస్కరరావు తెలియజేసినట్లు ఆసుపత్రి సుపరిటెండెంట్ డాక్టర్ చిన్నంనాయుడు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 10వ తేదీలోగా జిల్లా ఆస్పత్రుల అధికారి శ్రీకాకుళం కార్యాలయంలో సీల్డ్ టెండరు దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. మరెన్ని వివరాలకు జిల్లా అధికారిక వెబ్ సైట్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

ఎస్‌పి స్పందనకు 46 వినతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజలు సమస్యల పరిష్కారనికే స్పందన కార్యక్రమని, ఫిర్యాదుదారులు ఇచ్చిన ఫిర్యాదులను పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక పోలీస్ అధికారులకు ఆదేశించారు. ఎస్‌పి కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 46 మంది ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదిదారులు తమ తమ అభ్యర్థనలను రాతపూర్వకంగా విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పౌర సంబంధమైనవి ఏడు, మోస పూరితమైనవి ఆరు, కుటుంబ తగాదాలు సంబంధించనవి ఆరు, పాతవి మూడు, అదృశ్యంపై ఒకటి, ఆస్తి తగాదాలు పది ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ ఫిర్యాదులను క్షుణ్ణంగా



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం టెలిఫోన్ ద్వారా సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై తనకు ఎప్పటికప్పుడు నివేదిక అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి విఠలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పల రాష్ట్రంగా మార్చేశారు

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్



పోస్టర్‌ను అందజేస్తున్న రవికుమార్

పొందూరు: వైసిపి ప్రభుత్వం అసమర్థ పాలనతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి అప్పుల రాష్ట్రంగా మార్చివేసిందని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని గోకర్ణపల్లిలో పార్లమెంటరీ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు ఆధ్వర్యాన సోమవారం ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను పోస్టర్ల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రానికి ఆదాయం తీసుకురాకపోగా, అప్పులు తీసుకువచ్చి ప్రజలపై అప్పుల భారం మోపుతున్నారని అన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రతిపక్షాలపై రౌడీ మూకలతో దౌర్జన్యాలు చేసి రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చివేశారని ఆరోపించారు. కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, మండల టిడిపి ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి నాయుడు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వి.మురళి, చింతాడ కృష్ణవాసుదేవరావు, బొడ్డేపల్లి సత్యం, పైడి వాసుదేవరావు, పైడి రామారావు, సీపాన చక్రధరనాయుడు, మాజీ సర్పంచ్ సీపాన అనిత పాల్గొన్నారు.



కాలువులో పడి మృతి చెందిన స్నేహితులు

రాజపురంలో విషాదం

వంశధార కాలువలో పడి ముగ్గురు మృతి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

వంశధార కాలువలో స్నానానికి వెళ్లిన ముగ్గరు మృతి చెందడంతో రాజపురంలో విషాదఛాయలు అలముకున్నాయి. తండ్రీ కుమారులు కాలేపు నాగరాజు(35), తులసిరావు(9), నాగరాజు స్నేహితుడు వెంకటరావు(30)లు ఆదివారం అర్ధరాత్రి మృతిచెందిన విషయం తెలిసిందే. నాగరాజు రాజాంలోని ఓ జ్యూట్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. భార్య రేవతి, పిల్లలు తులసిరావు, కుమార్తె కిరణ్మయిలను తన స్వగ్రామంలోని అమ్మ వద్ద ఉంచాడు. ఆదివారం పిల్లలను చూడటానికి తన స్నేహితుడు పార్వతీపురం(మన్యం) జిల్లా సీతానగరం మండలం లచ్చయ్యపేటకు చెందిన వెంకటరావుతో కలిసి నాగరాజు ఇంటికి వచ్చాడు. వంశధార కాలువలో స్నానానికి వెళ్లిన వారు ఎప్పటికీ రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతికారు. రాత్రి 10గంటల సమయంలో తులసిరావు, 12గంటల సమయంలో మిగతా ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోమవారం ఉదయం వారి మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. తల్లీకొడుకులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

మాజీ ఎంపిటిసి మృతి

నందిగాం: మండలంలోని ప్రతాప విశ్వనాథపురానికి చెందిన మాజీ ఎంపిటిసి మజ్జి ఆనందరావు(67) అనారోగ్యంతో సోమవారం శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రిలో మృతి చెందారు. ఈయన 1995లో ఎంపిటిసిగా హరిదాసుపురం ప్రాదేశికానికి ప్రాతినిధ్యం వహించారు. న్యాయవాదిగా జీవితాన్ని కొనసాగించారు. ఈయనకు భార్య సత్యవతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న కళింగ కార్పొరేషన్ చైర్మన్ పి.తిలక్, ఎంపిటిసి ఎన్.శ్రీరామ్మూర్తి, మండల ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు, తదితరులు పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



రణస్థలం రూరల్ : పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రజని

'ఉపాధి' పనులు ప్రారంభం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని అరకభద్ర గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పనులను ఎంపిపి బోర పుష్ప సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ కులం, మతం చూడకుండా, రాజకీయాలు చూడకుండా అర్హతే ప్రాధాన్యంగా నవరత్నాలను అందిస్తున్నట్లు చెప్పారు. వంద రోజుల పనులను సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి శాడి కాంచన దేవి, వైసిపి నాయకులు రంగాల కృష్ణారెడ్డి, మంగి హేమమ్మా, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్ : మండలంలోని బంటుపల్లి తెలకల చెరువులో ఉపాధి హామీ పనులను సర్పంచ్ నడుకుదిటి రజని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన కొలతలు ప్రాప్తికి పనులు చేపట్టి కూలీలకు కనీస కూలి వచ్చేలా క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్ కృషి చేయాలన్నారు. రైతాంగానికి సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి క్షేత్ర సహాయలు తోలాపి రమణ, సెక్రెటరీ సింహాచలం, ఎంపిటిసి మాజీ సభ్యులు గురాల రఘునాథ్, టొంపల అప్పలరాజు, ఎల్డుటి ప్రసాద్ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న గోవిందరావు

'ఎంజిఆర్' ఆర్థికసాయం

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలోని రంకిని గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి టిడిపి నాయకులు, సామాజిక వేత్త మామిడి గోవిందరావు రూ.లక్ష ఆర్థికసాయం సోమవారం అందజేశారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు గ్రామానికి చేసుకుని ఆలయ నిర్మాణాన్ని పరిశీలించారు. భవిష్యత్‌లో గ్రామస్తులకు ఎవరికైనా అత్యవసర పరిస్థితుల్లో ఎటువంటి సహాయం కావాలన్నా తనను సంప్రదిస్తే తప్పక తన వంతు సహాయం ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ బైదులాపురం సింహాచలం, ఎంజిఆర్ టీమ్ ఎస్‌టి సెల్ అధ్యక్షులు బరండి గోపి, జన్ని రామారావు, లోవ ఆశయ్య, కోసింటి ఎండయ్య, గురడి పోతయ్య, కొత్త లక్ష్మణరావు, పాతూరు రవికుమార్ పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలను అందజేస్తున్న చిన్ని

50మంది రక్తదానం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని 9వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు (చిన్ని) 48వ జన్మదినం సందర్భంగా అభిమానులు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సోమవారం గేటులోని రామ మందిరం వద్ద జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన నిర్వహించిన రక్తదాన శిబిరంలో 50 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ కిరణ్ కుమార్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

కార్యాలయ ఆవరణలో అక్రమ బడ్డీ



కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన బడ్డీ

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి అనుమతులు లేకుండా అక్రమంగా బడ్డీ దుకాణం ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి వరకు లేని బడ్డీ సోమవారం ఉండడంతో ఎవరు పెట్టారు, ఎప్పుడు పెట్టారు అంటూ పట్టణ వాసులు ఆశ్చర్యపోయారు. ప్రభుత్వ స్థలంలో అందులోనూ కార్యాలయం ఆవరణంలో ఇతర కార్యాలయాలకు వెళ్లే దారిని ఆక్రమణ చేయడంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన అధికార పార్టీ నాయకుడి అండతోనే ఈ బడ్డీ ఏర్పాటు చేయడానికి సాహసించారని పలువురు పేర్కొంటున్నారు. దీనిపై ఎంపిడిఒ హరిహరరావును వివరణ కోరగా, కార్యాలయం ఆవరణలో దుకాణాలు ఏర్పాటు చేయాలంటే కార్యవర్గం తీర్మానం అవసరమని, తీర్మానం లేకుండా చేయడానికి వీలులేదని అన్నారు. బడ్డీ ఏర్పాటు చేస్తామంటే కొద్ది రోజుల క్రితమే హెచ్చరించామని, అనుమతులు లేకుండా బడ్డీ ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

మా భూమి మాకు ఇప్పించాలి

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న 520/1లోని 36 సెంట్లు, 521/3లోని 1.66 సెంట్లు భూమిని 22.1ఇ నుండి తప్పించి, తమ భూమిని తమకు అప్పజెప్పాలని జగద్ధాత్రి స్వర్ణకారుల సొసైటీ అధ్యక్షులు సాతివెల్లి అమ్మాజీరావు, లక్కోజి విఠల్, కొత్తపెల్లి రాజేశ్వరి, కంచుమోజు మల్లేశ్వరరావు, కోరారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 1966లో పి.అమ్మెజమ్మ దగ్గర సూమారు 2 ఎకరాల భూమిని కొన్నామన్నారు. ప్రభుత్వాలు మారినప్పటికీ మా బతుకులు మారలేదన్నారు. అందు కోసం సినీ నిర్మాత బలగ ప్రకాష్‌కు ఈ స్థలాన్ని అమ్ముకున్నామని, ఈ



మాట్లాడుతున్న స్వర్ణకారుల సంఘం నాయకులు

స్థలాన్ని 22.1ఇ నుంచి తొలగించి, మా భూములు ప్రకాష్‌కు అప్పజెప్పాలని కోరారు. ఆగస్టు 18న రిజిస్ట్రేషన్ చేయాలని కోర్టు తీర్పు ఇచ్చిందని, సోమవారం సబ్ కలెక్టర్ స్థలాన్ని పరిశీలించి, వారం రోజుల్లో స్థలం ఎవరిదని తేలుస్తామన్నారని చెప్పారు. లేకుంటే మీరు స్వాధీనం పర్చుకోవాలని పేర్కొన్నట్లు ప్రకాష్ తెలిపారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ఈశ్వరరావు

బీమా సాయం అందజేత

సంతబొమ్మాళి: మండలంలోని మరువాడ గ్రామ పంచాయతీలో చిన్న మరువాడ గ్రామానికి చెందిన బైపిల్లి నవీన్ కూర్మారావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. నామినీ నవీన్ కూర్మారావు, భార్య బైపల్లి లక్ష్మికి వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలు వైసిపి నాయకుడు గంట ఈశ్వరరావు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ అంగూరు మధుసూదనరావు, వాలంటీర్లు మైలపిల్లి లక్ష్మీ, సూరాడ అరుణ, గంట చాందిని, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జ్ఞానభారతిలో 'స్ఫూర్తి'

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక జ్ఞాన భారతి విద్యా సంస్థలో జోహార్‌ఖాన్ ఆధ్వర్యాన 'స్ఫూర్తి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జిల్లా పోలీస్ కళా బృందంతో మహిళల భద్రత.. మా బాధ్యత అని అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళల భద్రతపై పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలు గురించి అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న జోహార్‌ఖాన్

కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ ఈచ్ సి.రామారావు, ప్రిన్సిపాల్ ఐబి.పండా, ట్రస్టీ రమణమూర్తి, ఎఒ ప్రేమకుమార్, సర్తాజ్ ఖాన్, రషీద్ సుల్తాన్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో వైసిపి గెలిచి తీరాల్సిందే

జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ



మాట్లాడుతున్న పిరియా విజయ

ప్రజాశక్తి- కవిటి

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇప్పటివరకు వైసిపి అభ్యర్థి గెలుపు తీరానికి చేరలేదని, ఈసారి కచ్చితంగా గెలిచి తీరాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ మాట్లాడుతూ ఎంత సేవ చేసినా.. ఎంత చేరువైన ఇప్పటివరకు ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి గెలుపు తీరాలకు చేరలేదని, మీరంతా ఆదరించి, ఈ సారి గెలుపు తీరాలకు చేర్చాలని ఆకాంక్షించారు. వైఎస్ఆర్ ఆసరా, అమ్మఒడి, చేయూత, విద్యా దీవెన, వసతి దీవెన అంటూ ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కావాలంటే వైసిపి అధికారంలోకి రావాలని, అందులో ఇచ్ఛాపురం ఉండాలని అన్నారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ ఎక్కడికెళ్లినా ఇచ్ఛాపురం గెలుపుపైనే మాట్లాడుతున్నారని, ఈసారి మాత్రం ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థిని గెలిపించి ముఖ్యమంత్రికి బహుమతిగా ఇవ్వాలని కోరారు. వైసిపి ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తోందని, మహిళలు దాన్ని గుర్తించి రాబోయే ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం మహిళా సంఘ సభ్యులకు ఆసరా నమూనా చెక్కులు అందజేసి ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో డిఆర్‌డి పీడీ విద్యాసాగర్, ఎంపిపి కె.పద్మ, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, సర్పంచుల సంఘం అధ్యక్షులు పూడి లక్ష్మణరావు, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, ఎఎంసి వైస్ చైర్మన్ ఎలమంచి నీలయ్య, ఎఎబి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి, వైసిపి లీగల్ సెల్ కన్వీనర్ పులకల శ్రీరాములు, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, ఎంపిడిఒ సూర్యనారాయణ, ఎసి మోహనరావు, ఎపిఎం గోవింద్, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

చాపరలో ఆశీలు వేలంపాట

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆశీల వసూలకు సోమవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. ప్రభుత్వం రూ.98వేలు ధర నిర్ణయించగా, గ్రామానికి చెందిన గేదెల కృష్ణారావు రూ. 1,05,000కు పాటను దక్కించుకున్నారు. ఈ వేలం పాటలో 31 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోసి రామారావు, వైస్ ఎంపిపి ప్రతినిధి పాడి అప్పారావు, పంచాయతీ విస్తరణ అధికారి తిరుపతి పట్నాయక్, కార్యదర్శి మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

సోంపేట : మండలంలోని గోపాలపురం బట్టి, పట్టీల బట్టి మదుముల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ ఖగేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఎంపిపి డాక్టర్ ఎన్.దాసు, ఇరిగేషన్ జెఇ సూర్యప్రకాష్‌లను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మదుములు నిర్మాణం చేపడితే సాగు రైతులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. నిధులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు.



ఎంపిపితో మాట్లాడుతున్న సర్పంచ్ ఖగేశ్వరరావు

శిరీష తీరు మార్చుకోకుంటే బుద్ధి చెప్తాం

వైసిపి నాయకుల ధ్వజం

పలాస : టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష తన తీరు మార్చుకోకుంటే మహిళలతో తగిన బుద్ధి చెప్పిస్తామని వైసిపి జిల్లా కార్యదర్శి ఉంగ సాయికృష్ణ, పట్టణ అధ్యక్షులు ఎస్.సింహాచలం, అధికార ప్రతినిధి జోగారావు హెచ్చరించారు. సోమవారం ప్రగతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎదుగుతున్న ఓ రాజకీయ నాయకునిపై అక్కసుతో విమర్శిస్తున్నారని, విమర్శించే తీరులో విజ్ఞత కోల్పోయి శిరీష మాట్లాడుతున్న తీరు హేయమైందని అన్నారు. 60ఏళ్లుగా ఈ ప్రాంతాన్ని పాలించిన గౌతు కుటుంబం చేయలేని అభివృద్ధిని మంత్రి అప్పలరాజు చేసి చూపించారని, ఇది వారికి కంటిలో నలుసుగా మారిందని ఆరోపించారు. టిడిపి మండల



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

అధ్యక్షుడు లక్ష్మణ్‌పై దాడి భూ వ్యవహారానికి సంబంధించిందని, మంత్రికి ఈ ఘటనతో సంబంధం లేదన్నారు. రెండు ఎకరాల భూమిని రియల్ ఎస్టేట్ చేసి, అక్రమంగా డబ్బులు సంపాదించింది ఎవరు? అని ప్రశ్నించారు. ఇచ్ఛాపురానికి చెందిన వ్యక్తులు దాడి చేస్తే, మంత్రిపై నింద వేయడం తగదన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు దుర్గాశంకర్ పండా, బల్ల శ్రీనివాస్, దువ్వాడ రవి, బమ్మిడి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

పలాస: జగనన్న ఇళ్ల కాలనీ లబ్ధిదారులకు కేవలం రూ.1.80 లక్షలు మంజూరు చేస్తే ఎలా ఇళ్లు కట్టగలరని వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు చాపర సుందరలాల్ అన్నారు. ఒక్కో లబ్ధిదారునికి పెరిగిన ధరల ప్రకారం రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ టెక్కలిపట్నం సచివాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదల నివాస ప్రాంతాలకు ఎంతో దూరంగా ఇంటి స్థలం కేటాయించారని, అద్దెలు కట్టలేని సొంత ఇంటి కల నెరవేరుతుందని ఎదురుచూస్తున్నారన్నారు. ఇసుక, సిమెంట్ సరఫరా చేయాలని కోరారు.

ముగిసిన సేవా శిబిరం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని చిట్టివలసలో ప్రభుత్వ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి జలుమూరు రవిబాబు అధ్యక్షతన నిర్వహించిన సేవా శిబిరం సోమవారంతో ముగిసింది. సర్పంచ్ ప్రతినిధి గుజ్జల లక్ష్మణరావు, ఎచ్చెర్లలోని శివాని ఇంజినీరింగ్ కాలేజ్ డైరెక్టర్ సనపల నర్సింగరావు, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ సందీప్, రోటరీ-3020 జిల్లా అసిస్టెంట్ గవర్నర్ జె.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాల్లో పాల్గొని భావి భారత దేశ పౌరులుగా రూపుదిద్దుకోవాలని చెప్పారు.

రోటరీ ఇంటర్నేషనల్ సేవా కార్యక్రమాల్లో భాగంగా పోలియో రహిత సమాజంగా రూపుదిద్దడానికి వాక్సిన్లను సరఫరా చేస్తుందని అన్నారు. వైద్య శిబిరాలు, సోలార్ ప్రాజెక్ట్, ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఆర్థికసాయం అందిస్తుందని చెప్పారు. అనంతరం విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, వక్తృత్వ, వ్యాసరచన, ఆటలు, పాటలు పోటీల విజేతలకు రవిబాబు బహుమతులను అందజేశారు.



బహుమతులను అందజేస్తున్న నర్సింగరావు



కళ్యాణంలో పాల్గొన్న మంత్రి ధర్మాన

ఘనంగా ఆదిత్యుని కళ్యాణం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక కళ్యాణం సందర్భంగా వేద పండితుల సత్కార కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పాల్గొని వైదిక పండితులకు దుశ్శాలువలు కప్పి ఆలయ సాంప్రదాయబద్ధంగా సన్మానించారు. ముందుగా సూర్యనారాయణస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైదిక పండితులు రాజమండ్రికి చెందిన ధూళిపాళ మహాదేవ మణి, భాస్కరభట్ల నరసయ్యశర్మ, భాస్కరభట్ల శ్రీరామశర్మ, బంకుపల్లి రమేష్‌శర్మ, సుసరావు చంద్రశేఖరశర్మ, రంప సాయిశర్మ, నేతేటి గణేశ్వరరావులు సత్కారాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్, ఆలయ పాలక మండలి సభ్యులు ద్వారపు అనురాధ, జోగి మల్లిమ్మ, మైలపల్లి లక్ష్మి, నెమలపురి చౌదరి, దుక్క గనిరాజు, జలగడుగుల శ్రీనివాస్, తహశీల్దార్ ఎన్.వెంకటరావు, 1 టౌన్ ఎస్ఐ బలివాడ గణేష్ పాల్గొన్నారు.

స్వామివారి తిరువీధి

వార్షిక కళ్యాణంలో భాగంగా చైత్రశుద్ధ త్రయోదశిని పురస్కరించుకుని కళ్యాణమూర్తులను వైజయంతి రథంపై తిరువీధి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు ద్వారపు అనురాధ, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ పాల్గొన్నారు.



కిట్లను పంపిణీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

నవధాన్యాల విత్తన కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని నిమ్మతొర్లాడలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మహిళా సంఘ రైతులకు 120 నవధాన్యాల విత్తన కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఒక్కో విత్తన కిట్‌లో 30 రకాల విత్తనాలు కలిగి 13 కేజీలు ఉంటాయని, ఇది ఒక ఎకరా విస్తీర్ణానికి సరిపోతుందని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవిరావు తెలిపారు. ఎంతమంది రైతులు ఉన్నారో, ఎన్ని ఎకరాలకు ఎన్ని కిట్లు అవసరమవుతాయో కార్యాచరణ వేసుకుని ఆ విధంగా రైతులకు నవధాన్యాల విత్తనాల కిట్లను ఇస్తున్నామని అన్నారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సేవలను సద్వినియోగం చేసుకుని నవధాన్యాల సాగును తప్పకుండా చేయాలని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లక్ష్మి, కృష్ణవేణి, మల్లేష్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం

ఆమదాలవలస : ఆన్‌లైన్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. మండలంలోని రామచంద్రాపురంలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో భాగంగా ఆర్థిక అక్షరాస్యతపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్లు చేసి మన బ్యాంకు అకౌంటు వివరాలను అడిగితే సమాచారాన్ని ఇవ్వవద్దని సూచించారు. ఎటిఎంల్లో అపరిచితులకు డబ్బులు విత్ డ్రా చేసి పెట్టమని కార్డును ఇవ్వరాదని సూచించారు. సైబర్ మోసాలకు గురైనట్టయితే 1930 టోల్ ఫ్రీ నంబరు, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ 14448 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఎటిఎం కార్డుల వెనక పిన్ నంబరు రాయవద్దని సూచించారు. కార్యక్రమంలో విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ కొల్లి గాయత్రి, సిఎఫ్ఎల్ కౌన్సిలర్ రామారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశ సరిహద్దుల్లో సేవలందించిన మాజీ సైనికులకు ఎదురయ్యే సమస్యలను రక్షణశాఖ తక్షణమే పరిష్కరించాలని జిల్లా మాజీ సైనికుల సమాఖ్య అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు డిమాండ్ చేశారు. జాతీయ స్థాయి దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద మాజీ సైనికులు చేపట్టిన ధర్నాకు సంఘీభావంగా జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వన్ ర్యాంక్-వన్ పెన్షన్-2లో మాజీ సైనికులకు ఎదురవుతున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. మిలిటరీ సర్వీస్ పే, డిజేబిలిటీ పెన్షన్ అన్ని రాంకులకూ ఒకేలా ఉండాలన్నారు. సైనిక వితంతువుల పెన్షన్ ఏడేళ్ల తరువాత నార్మల్ ఫ్యామిలీ పెన్షన్‌గా మారుస్తున్నారని, దానివల్ల వీర నారీలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్‌లో ఏడేళ్ల క్లాజ్ తొలగించాలన్నారు. మాజీ సైనికులకు ఒఆర్ఒపి-2 స్థానం కల్పించాలన్నారు. పే, పెన్షన్ రివిజన్ కమిటీలో జెసిఒ, ఒఆర్‌లకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికుల సమాఖ్య చైర్మన్ గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వరరావు, హనరరీ ప్రెసిడెంట్లు బి.సంజీవరావు, టి.కృష్ణారావు, వైస్‌ప్రెసిడెంట్ వి.సూర్యనారాయణ, జనరల్ సెక్రటరీ ఎస్.రామారావు, మహిళా సెక్రటరీ పి.పద్మావతి, జాయింట్ సెక్రటరీ పి.మురళీధరరావు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.



ఆందోళన చేస్తున్న మాజీ సైనికులు

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ఆమదాలవలస : మాట్లాడుతున్న శ్రీరామ్మూర్తి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి అన్నారు. మండలంలోని తొగారాంలో తొగరాం సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు పోషణ్ పఖ్వాడ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాజా ఆకుకూరలు, పళ్లు, పాలు, కూరగాయలు ఆహారంలో తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.రేణుక, సిడిపిఒ కె.బాలామణి, అంగన్వాడీ సూపర్‌వైజర్ లీలారాణి, అంగన్వాడీ కార్యకర్తలు పంచాది లతాదేవి, ఎ.అరుణ, వి.పుష్ప, ఎస్.పద్మ, వై.సూరీడు, హేమ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : తల్లులు, బాలింతలు సమగ్ర పౌష్టికాహారం తీసుకోవాలని డిఆర్‌డిఎ ఎపిఎం ఎస్.ధనలక్ష్మి సూచించారు. నగరంలోని దమ్మలవీధిలో పోషణ పఖ్వాడ వక్షోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సీతామహాలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని మండపల్లి పంచాయతీ భవానిపురం అంగన్వాడీ కేంద్రంలో పోషణ పఖ్వాడ కార్యక్రమంలో భాగంగా హెల్త్ బేబీ పోటీలు నిర్వహించారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్త నరసమ్మ బేబీ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

రైలు ప్రయాణికులకు అవగాహన

ఆమదాలవలస : ప్రయాణికులు రైలులో ప్రయాణించేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని రైల్వే ఆర్‌పిఎఫ్ ఎస్ఐ బి.అరుణ అన్నారు. శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్‌లో రైలు కోసం వచ్చే ప్రయాణికులకు మూడో నంబరు ప్లాట్‌ఫారంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైలు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు జాగ్రత్త వహించాలన్నారు. పిల్లలను ప్లాట్‌ఫారంపై విడిచి పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైలు వచ్చేటప్పుడు పిల్లలు ట్రాక్ వైపు వెళ్లకుండా చూడాలన్నారు. చాలామంది వ్యక్తులు తమ బంధువులను రైలు ఎక్కించేందుకు వచ్చి ప్రయాణికులతో పాటు వారూ ఎక్కుతున్నారని, రైలు కదిలే సమయంలో ఆదరాబాదరగా దిగే ప్రయత్నంలో ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. ఇటువంటి విధానాలకు స్వస్తి చెప్పాలని సూచించారు. విలువైన సామగ్రి, ఆభరణాలను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. ఏదైనా అత్యవసర సమయంలో 139 నంబరుకు చేస్తే రైల్వే పోలీసులు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చి వారి సహకారాన్ని అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌పిఎఫ్ పిసిలు ఎల్.ఎస్.రావు, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఆర్‌పిఎఫ్ ఎస్ఐ అరుణ



దీక్ష చేస్తున్న బాధితులు

న్యాయం చేయాలి

శ్రీకాకుళం అర్బన్ : 1971లో కొనుగోలు చేసి తన తల్లి ద్వారా వారసత్వంగా సంక్రమించిన భూమికి సంబంధం లేని వ్యక్తికి అనుకూలంగా తప్పుడు నివేదికలు ఇస్తూ, కోర్టు తీర్పులను విరుద్ధంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని బాధితులు కోల లలిత, ఆమె భర్త నీలకంఠరావు కోరారు. ఈ మేరకు నగరంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ శిబిరానికి సంఘీభావం తెలిపిన సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా అధ్యక్షులు అనపాన షణ్ముఖరావు, డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి మాట్లాడారు. బొమ్మాళి కాశీయమ్మ 1971లో కొనుగోలు చేసి తన తల్లి ద్వారా వారసత్వంగా కోల లలితకు సంక్రమించిన పాత్రునివలస రెవెన్యూ గ్రామంలో సర్వే నంబరు 162/4లో 0.40 భూమిని 35 ఏళ్ల తర్వాత 1బి, అడంగల్‌ను రెవెన్యూ అధికారులు మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని న్యాయం చేయాలని బాధితులు కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు పంచిరెడ్డి అప్పారావు, డిహెచ్‌పిఎస్ నాయకులు బలగ రామారావు, ముడిదాన భాస్కరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఉప్పాడ సూర్యనారాయణ, బడే కర్రెన్న రెడ్డి, మత్స్య కార్మిక సంఘం నాయకులు నాగుల తవుడు, గిరిజన సంఘం నాయకులు దేవుడలై వెంకటరావు పాల్గొన్నారు.



సమస్యను వివరిస్తున్న సొండి ప్రతినిధులు

ఒబిసి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎపి సొండీల సంక్షేమ సంఘం ప్రతినిధులు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును ఆదివారం రాత్రి ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సొండీలను ఒబిసి జాబితాలో చేర్చాలన్నారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో సొండీల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాశీ విశ్వనాథ్‌చౌదరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రాజారావు, ఉపాధ్యక్షులు యు.గణపతిరావు, కార్యదర్శి షావుకారి నాగేశ్వరరావు, భారతి, శ్రీనివాసరావు, ఎస్.గిరిబాబు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

రేగిడి : గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ జి.శ్రీ చరణ్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నాయని గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. ప్రాజెక్టు నుంచి వచ్చిన తాగునీరు సాంకేతిక పరమైన సమస్యలు వస్తే సమాచారం అందించాలన్నారు. తాగునీటి బోర్లు, మంచినీటి పథకాలు మొరాయిస్తే తక్షణమే నివేదికలు అందించాలన్నారు.



మాట్లాడుతున్న ధనలక్ష్మి

నేడు 'ఆసరా' సంబరాలు

ప్రజాశక్తి - ఆమదాలవలస

పట్టణంలోని జూనియర్ కాలేజీ కళాశాల మైదానంలో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు పట్టణస్థాయి మహిళా సంఘాల ఆసరా సంబరాలు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ పాల్గొంటారని ఎపిఎం పైడి కూర్మారావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు తమ్మినేని ధనలక్ష్మి తెలిపారు. పట్టణంలోని మండల మహిళా సమైక్య కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. వైఎస్ఆర్ మూడో విడత ఆసరా నమూనా చెక్కులను పంపిణీ చేస్తారని, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, గ్రామ సంఘాల ప్రతినిధులు, మండల స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ పనివేళలు మార్పు

ఇచ్ఛాపురం: ఈ నెల 4వ తేదీ నుంచి మే 31 వరకు అంగన్వాడీ కేంద్రాల పని వేళల్లో మార్పు చేస్తున్నట్లు ఐసిడిఎస్ పీడీ నాగరాణి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం పిల్లలకు ఇచ్చి, వాళ్లను ఇంటికి పంపించనున్నట్లు చెప్పారు. కార్యకర్త, సహాయకులు కేంద్రంలో నాలుగు గంటల వరకు అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ మార్పులు గమనించి, కేంద్రాలను నిర్వహించాలన్నారు.



భూమి పూజలో పాల్గొన్న రాజ్యలక్ష్మి

అభివృద్ధి పనులకు భూమి పూజ

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి సోమవారం భూమి పూజ చేశారు. పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో 8వ వార్డు కొండివీధిలో పాత కామేష్ ఇంటి నుంచి బి.మోహిని ఇంటి వరకు రూ.5 లక్షలతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన, కస్పా వీధి వద్ద జనరల్ ఫండ్ రూ.66వేలతో కాలువ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. వైస్ చైర్‌పర్సన్ స్వర్ణమణి, కౌన్సిలర్లు మధు, లీలారాణి, కో-ఆప్షన్ మెంబరు సాలీనా ఢిల్లీ, లాభాల శంకరరావు, షఫీ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

కిడ్నీ రోగికి ఆర్థికసాయం

కవిటి: మండలంలోని మాణిక్యపురం గ్రామానికి చెందిన కిడ్నీ రోగికి అన్నవరం హెల్పింగ్ హాండ్స్ అండగా నిలిచింది. గ్రామానికి చెందిన సుశీల బెహరా కూలి పనులు చేస్తూ జీవిస్తోంది. రెక్కాడితే కానీ డొక్కాడని ఆమె ఇటీవల కిడ్నీ వ్యాధి బారిన పడింది. ప్రస్తుతం డయాలసిస్ చేయించుకుంటోంది. దీంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. మరోవైపు ఆమె డయాలసిస్ కోసం చేసిన ఫిస్టులా విఫలమైంది. దీంతో ప్రస్తుతం ఆమె మరలా ఫిస్టులా చేయించుకునే పరిస్థితిలో లేదు. విషయం తెలుసుకున్న అన్నవరం హెల్పింగ్ హాండ్స్ సభ్యులు సోమవారం సాయంత్రం గ్రామానికి చేరుకొని ఆమెకు తక్షణసాయంగా రూ.3 వేలు, బియ్యం బస్తా అందించారు. కార్యక్రమంలో సీతయ్య ఫౌండేషన్ అధ్యక్షుడు గుళ్ల రమేష్, హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకుడు గోపి బిసాయి, సిద్ధు మజ్జి, లలిత బిసాయి, సునీత రౌలో, రాజేష్ మజ్జి, ఓంకార్ మజ్జి, ప్రవీణ్ మజ్జి, ధనుంజయ, రాజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మణికంఠకు డాక్టరేట్ ప్రదానం

శ్రీకాకుళం అర్బన్ : న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు ద్వారా ప్రజలకు సేవలందిస్తున్న తొత్తడి మణికంఠకు గౌరవ డాక్టరేట్‌ను సెయింట్ పాల్స్ థియోలాజికల్ కళాశాల అందజేసింది. కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.పాల్ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కోవిడ్ వారియర్స్ ప్లాస్మా దానాలు, ఫ్రంట్ లైన్ వర్కర్స్‌కి చేయూత, కరోనాతో మృతి చెందిన వారికి దహన సంస్కారాలు, తలసేమియా ఎయిడ్స్ వంటి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా పౌష్టికాహారం సరఫరా, రక్తదానాలు వంటి సేవా కార్యక్రమాల్లో మణికంఠ భాగస్వామ్యులయ్యారు. ఆయన సేవలకు గుర్తింపుగా డాక్టరేట్‌ను అందజేసినట్లు కళాశాల యాజమాన్యం ప్రకటించింది.



డాక్టరేట్ పట్టాను అందుకుంటున్న మణికంఠ